# నిరంతర కరెంటా? దరిద్రపు కాంగ్రెస్సా?

- ఆలోచించి ఓటెయ్యండి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి
- కర్ణాటక ప్రజలు చెంపలేసుకుంటున్నరు
- కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేసి రైతుబంధును ఆపినయ్
- రైతుల నోటికాడి బుక్క లాక్కున్నయ్
- ఆ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- హుజూరాబాద్‌లో రోడ్ షోలో తీవ్రస్థాయిలో ధ్వజం
- 30 వేలకు పైగా తరలివచ్చిన ప్రజలు
- జనసంద్రమైన పట్టణ వీధులు

హుజూరాబాద్/టౌన్/రూరల్, నవంబర్ 27 : ''రైతులను అన్ని విధాలుగా అండగా ఉంటూనే నిరంతర కరెంటు ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలా? మూడు గంటల కరెంటు చాలు అనే దరిద్రపు కాంగ్రెస్ కావాలా? మీరే ఆలోచించి ఓటేయండి. ఇప్పటికే కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేశామని కర్ణాటక ప్రజలు చెంపలేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి ఇక్కడ రావద్దు. కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేసి రైతుల నోటికాడి బుక్క లాక్కున్నట్టు రైతుబంధును ఆపించినయ్. ఆ పార్టీలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి. మోదీ ప్రియమైన ప్రధాని కాదు.. పిరమైన ప్రధాని. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వందల మందిని బలితీసుకున్న బలిదేవత'' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో పార్టీ అభ్యర్థి, మండలి విప్, బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సుమారు 30 వేలకు పైగా వచ్చిన ప్రజలతో పట్టణ వీధులు కిక్కిరిసి పోగా, వారినుద్దేశించి అమాత్యుడు రామన్న ప్రసంగించారు. ఎన్నికలు వ్యక్తుల మధ్య కాదని, పార్టీల మధ్య పోరు జరుగుతుందని, అభివృద్ధి చేసే పార్టీ వైపు ఉండాలని సూచించారు. నాటి తెలంగాణ ఉద్యమంలో ఎంతోమందిని కాల్చి చంపిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్‌దేనని, మొన్న జరిగిన ఉద్యమంలో ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న బలి దేవత సోనియాగాంధీ అని మండిపడ్డారు. రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్, బీజేపీ లేఖలు రాశాయన్నారు. రైతుల మేలు కోసం రైతు బంధు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కేంద్ర ఎన్నికల కమిషన్‌కి విజ్ఞప్తి చేయగా అధికారులు పచ్చ జెండా ఊపారని, మళ్లీ కిరికిరి పెట్టి అడ్డుకున్న దుర్మార్గులు కాంగ్రెస్, బీజేపీ నాయకులని మండిపడ్డారు. రైతుబంధు వస్తే రైతులంతా బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తారని కాంగ్రెస్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి కుట్రలు పన్ని, రైతుల నోటి కాడికి వచ్చిన ముద్దను గద్దలు లాక్కున్నట్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీల సన్నాసులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.


హుజూరాబాద్ రోడ్‌షోలో పెద్ద సంఖ్యలో జనం


రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కౌశిక్ రెడ్డి

## కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా?

2014కు ముందు తెలంగాణలో కరెంటు కష్టాలు ఎలా ఉండేవో ప్రజలకు తెలుసునని, అప్పుడు ఎవరైనా చనిపోతే స్నానాలు చేయడానికి పది నిమిషాల కరెంటు ఇవ్వాలని అధికారులను బతిమిలాడుకునే రోజులు ఉండేనని గుర్తు చేశారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ మొత్తం 24 గంటల కరెంటు ఇస్తూ ప్రతి ఇంటిలో వెలుగులు నింపిందని, కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. అన్ని రకాలుగా తెలంగాణ ప్రజలను అరిగోస పెట్టిన కాంగ్రెస్ దరిద్రం మళ్ళీ కావాలా? అంటూ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ ధన్‌ధన్‌గా జన్ ధన్ ఖాతాలు తీయమని చెప్పి, రూ.15 లక్షలు ఖాతాలో వేస్తామని కనీసం రూ.15లు కూడా వేశారా? అని ప్రశ్నించారు. కేంద్రం రూ.15 లక్షలు వేస్తే బీజేపీకి ఓటు వేయాలని, లేదంటే రైతుబంధు, దళిత బంధు డబ్బులను ఖాతాల్లో వేసిన కేసీఆర్ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. దేశంలో పప్పు, ఉప్పు వంటి అన్ని నిత్యవసర వస్తువుల ధరలు అగ్గి మండుతున్నాయని, అందుకే ప్రియమైన ప్రధానమంత్రి అనడం మానేసి ప్రజలంతా పిరమైన ప్రధాని అంటున్నారని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈసారి హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే బాధ్యత తీసుకుంటానని మాటిచ్చారు. గతంలో జరిగిన తప్పు ఇప్పుడు చేయద్దని కోరారు. ఇక్కడి ప్రజల అభిమానం చూస్తుంటే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలువడం ఖాయం అనిపిస్తుందన్నారు. సిరిసిల్ల తరహాలో అభివృద్ధి జరగాలంటే అక్కడ వచ్చిన మెజార్టీ కన్నా ఇక్కడ వస్తేనే హుజూరాబాద్ సుందరవనంగా మారుతుందని చెప్పారు.

## దండం పెట్టి అడుగుతున్నా.

గత 15 ఏళ్లుగా హుజూరాబాద్ నియోజకవర్గంలోనే ప్రజల మధ్య గడుపుతున్నా. ఎవరికి ఏ ఆపద వచ్చినా అన్నా అంటే నేనున్నా అంటూ నా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నా. దండం పెట్టి అడుగుతున్నా నా కష్టాన్ని గుర్తించండి. ఉప ఎన్నికల తరువాత రూ.50 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేశా. కేటీఆర్ కృషితో హుజూరాబాద్‌లో స్పోర్ట్స్ స్టేడియానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశా. భూమిపూజ కూడా పూర్తయింది. నన్ను గెలిపిస్తే మినీ కలెక్టరేట్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతా. ప్రజా ఆశీర్వాద సభలో నన్ను గెలిపిస్తే హుజూరాబాద్‌ను దత్తత తీసుకుంటానని సీఎం కేసీఆర్ చెప్పింది గుర్తుంచుకోండి. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం. హుజూరాబాద్‌లో ఎవరు గెలిస్తే బాగుంటుందో ఆలోచించాలి. ముఖ్యమంత్రి కాళ్లు పట్టుకొని అయినా సరే రూ.వెయ్యి కోట్లు తీసుకువస్తా. సిద్దిపేట తరహాలో అన్ని విధాలుగా తీర్చిదిద్దుతా. మాటమీద నిలబడకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగ. అక్కాచెల్లెళ్లారా, అన్నాదమ్ముళ్లారా ఒక్కసారి ఆలోచించండి. ఒక్క అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని నిరంతరం అభివృద్ధి పథంలో నడిపిస్తా.

**– పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి**


జమ్మికుంట: 21వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు


ఇల్లందకుంట: సిరిసేడులో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


హుజూరాబాద్‌టౌన్: 27వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

# బీఆర్‌ఎస్ ప్రచారం ముమ్మరం

- ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరిస్తున్న పార్టీ శ్రేణులు
- నియోజకవర్గంలో 'పాడి'కి పెరుగుతున్న మద్దతు

జమ్మికుంట, నవంబర్ 27: బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ శ్రేణుల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. సోమవారం జమ్మికుంట మండలంలోని అన్ని గ్రామాల్లో.. మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి కారుగుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ సర్కారు చేసిన ప్రగతి, మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అందిస్తున్న పథకాలను గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చర్చిస్తున్నారు. ఇక్కడ ఏడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రజలను పట్టించుకోని వైనాన్ని వివరించారు. ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోలేదని చెప్పారు. ప్రజల మధ్యనే తిరుగుతూ సమస్యలను పరిష్కరిస్తున్న కౌశిక్‌రెడ్డినే గెలిపించుకుందామని, హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ శ్రేణుల ప్రచారానికి ప్రజలు నీరాజనం పడుతున్నారు. ఇక ఎన్నికలు సమీపిస్తుండడంతో రోజురోజుకూ పాడి కౌశిక్‌రెడ్డికి ప్రజల మద్దతు పెరుగుతూ పోతున్నది. ఆయా ప్రచార కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలున్నారు.

### ఇల్లందకుంటలో..

ఇల్లందకుంట, నవంబర్ 27: మండలంలోని సిరిసేడు, ఇల్లందకుంట, టేకుర్తి, వంతడుపుల, పాతర్లపల్లి, కనగర్తి, శ్రీరాంలపల్లి, వాగొడ్డురామన్నపల్లి, మల్యాల, లక్ష్మాజీపల్లి, చిన్నకోమటిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో సర్పంచులు రఫీఖాన్, మొగిలి, దిలీప్‌రెడ్డి, రజితావాసుదేవరెడ్డి, రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఉప్పుల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాల కొమురెల్లి, మాజీ సర్పంచ్ బుర్ర రమేశ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ నాయకుడు జవ్వాజి కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లయ్య, రాజబాబు, రమేశ్, శ్రీనివాస్, అభిలాష్, ముస్తాఫా, రాజేందర్, చంద్రమౌళి, చిరంజీవి, జానీ, దాసు, రాజు, ప్రమోద్, రాజీర్, సీతరెడ్డి తదితరులు ఉన్నారు.

### హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 27: బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. 27వ వార్డులో తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, 9వ వార్డులో కౌన్సిలర్ మెరుగు కొండల్ రెడ్డి, 11వ వార్డులో దండ విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను వివరించారు. మోడల్ ఈవీఎంలను చూపుతూ రెండో నెంబర్ కారుగుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణ వెనుకబడగా, స్వరాష్ట్రంలో కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల వారికి న్యాయం చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం హుజూరాబాద్ ఓటర్లు సీఎం కేసీఆర్ వెంటే ఉండాలని కోరారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నదని, హుజూరాబాద్‌లో పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకోవడం వల్ల నియోజకవర్గం అన్ని విధాలా మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను దీవించి, భారీ మెజార్టీతో అందించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

వీణవంక, నవంబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోతిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డిపల్లిలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, ఎలుబాకలో జడ్పీటీసీ మాడ నవమాల-సాధవరెడ్డి, వీణవంకలో వైస్‌ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, పాడి కార్తీక్‌రెడ్డి, వల్భాపూర్‌లో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి, చల్లూరులో జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రెడ్డి, ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ చేసి అభివృద్ధిని ప్రజలకు వివరించి, పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.